[ఆర్థికంగా ముందున్న దేశాలలో నిరుద్యోగులకు, ముసలి వారికి ప్రభుత్వం ఎంతో కొంత నెలసరి భత్యమిచ్చి ఆదుకుంటుంది. కాని, మన దేశంలో ఇంత వరకు గరీబీ హటావోవంటి నినాదాలే వినిపిస్తున్నాయి. మన ప్రగతి నినాదాల స్థాయి నుండి వ్యక్తి సాయివరకు ఇంకా రాలేదు. ప్రభుత్వోద్యోగి మట్టుకు గరీబు కాడా? రిటైరయిన తరవాత అతని గతేం కాను? అతని శేషజీవితం నిశ్చింతగా గడుస్తుందని కచ్చితంగా చెప్పలేము కొంతమందికి పెన్షనివ్వబడుతుంది. మరికొంత మందికి పెనను దొరకదు. అతనికి పెన్షనివ్వడమనేది అతని సర్వీసును బట్టికాక అర్థం లేని ఒక మాటపైన, ప్రాణం లేని ఒక పోస్టుపైన ఆధారపడి ఉంటుంది. నినాదాలు పుష్కలంగా వినిపిస్తున్న కాలంలో రిటైరయిన ఉద్యోగికి కూడా నెల నెలా ఎంతో కొంత ముట్టచెప్పి అతనికి ఏదో ఒక ఉపాధిని కల్పించడం ప్రభుత్వానికి కనీస ధర్మం- కేంద్రం కేంద్ర ప్రభుత్వోద్యోగుల కేర్పరిచిన పద్ధతులనే సుమారుగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉద్యోగులకొరకు ఏర్పాటు చేస్తూ ఉంటాయి. అట్టి పద్ధతులలోని ఒక అసమంజసమైన భాగమే దీనిలోని కథా వస్తువు.

రచయిత.]

## ఆగస్టు ఒకటి

ప్రశ్న వినిపించనట్లు లోనికి పోతున్న కొడుకును ఆపి మళ్ళీ ప్రశ్నించాడు శివరామయ్య:

'ఏంవోయ్! ఇంటర్వ్యూ ఎలా జరిగింది? ఈ ఉద్యోగమైనా దొరికే ఆశ ఉందా?'

'ఏదోలాగ జరిగింది. ఆశట! ఆశ. ఎలాగుంటుంది? ఇంతకీ మేమెలాగ ఏడిస్తే మాత్రం మీ కేం? మీ వ్యక్తిత్వం, ఎవరికీ పనికిరాని మీ నియమాలూ—ఇవేకదా మీకు ముఖ్యం! కుటుంబం, పిల్లలు ఎలాగ బాధపడుతున్నా, ఏమయిపోయినా మీకు బాధ లేదు. ఇంకొక నెల్లాళ్లలో మీరు రిటైరు కాబోతున్నారు. తరవాత ఈ సంసారం ఎలాగ గడుస్తుందని మీ రెప్పుడయినా ఆలోచించారా? నాన్నా, ఒక్కసారి వెళ్ళి మీరు వారికి చెప్పండి, మీరు చెబితే నాకు తప్పకుండా ఈ ఉద్యోగం దొరుకుతుందని మీతో ఎన్నిసార్లో అన్నాను. ప్రార్థించాను. మీరు పట్టించుకోలేదు. మీ ఆఫీసులో ఇంటర్వ్యూకుకూడా మీరు కనీసం మాట సహాయమయినా చెయ్యలేకపోయారు. ఈ రోజులలో ఉద్యోగం కావాలంటే లంచాలనయినా పొయ్యాలి. మన కా శక్తి లేదు. లేదా రికమెండేషన్లయినా ఉండాలి. నాకా ఆస్కారం కూడా లేదు. అందుచేత నాకీ జన్మలో ఉద్యోగం దొరకదు. ఇటుపైన ఈ కుటుంబం ఎలాగ బ్రతుకుతుందో మీకూ, ఆ భగవంతుడికే తెలియాలి.'

సమాధానం చాలా విసురుగా వచ్చింది. కొడుకు మాటలకు బాధపడిన శివరామయ్య తిరిగి వార్తాపత్రిక లోనికి తల దూర్చి, ఈ ప్రపంచంనుండి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు.

## ఆ రాత్రి

'ఏమండీ? మిమ్మల్నే. పడుకున్నారా?'

సమాధానం లేదు.

బాధలతోను, సమస్యలతోను సతమతమవుతున్న శివరామయ్య ఈ మధ్య ఆలోచనలతో బుర్ర వేడెక్కి నిద్ర రాక మంచంమీద దొర్లుతూనే అనేక రాత్రులు బట్టి కాలక్షేపం చేయడం నేర్చుకున్నాడు. సాయంకాలం కొడుకన్న మాటలు పదేపదే గుర్తుకు వచ్చాయి. భార్య చెప్పబోయేదికూడా అతనికి తెలుసు.

'ఒక్క మాట చెపుతాను. కోపం తెచ్చుకోకండి.'

మౌనం.

'చెప్పేదా?'

'చెప్పవే.'

'రేపొక్కసారి వెళ్ళి మీ ఆఫీసరుగారితో మాట్లాడండి. మీరు చెపితే మన రామానికీ ఉద్యోగం తప్పక దొరుకుతుంది. మీ రంటే ఆఫీసరుగారికి చాలా గురని అందరూ అంటారు. మీరు ఒక్కసారి వెళ్ళి ఆయనతో మాట్లాడి రండి.'

'నువ్వూ మొదలెట్టావూ?'

'మరేం చెయ్యడమండీ? వాడి నడిగితే ఈ ఉద్యోగం కూడా దొరికేటట్లు లేదన్నాడు. ఇన్నాళ్ళూ మీ ఒక్కరి సంపాదనతో సంసారాన్ని ఎలాగో నెట్టుకొచ్చారు. నెలకు నాలుగు వందల జీతం వచ్చినప్పుడే కటాకటిగా ఉందికదా, మీరు రిటైరయిన తరవాత ఏమి చేస్తామండీ? కొంచెం ఆలోచించండి. నెల్లాళ్ళలో మీరు రిటైరు కాబోతున్నారు. వచ్చే పింఛను డబ్బులతో ఈ సంసారం గడవడ మెలాగ? ఈ లోపునే రామానికి ఒక ఉద్యోగమంటూ దొరికితే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు. అందుచేత రేపు మీ ఆఫీసరుగారితో ఒక్కసారి మాట్లాడి రండి. ఇది మన అవసరం. అత్యవసర పరిస్థితులలో నియమాలను కాస్త సడలించుకుంటే తప్పు లేదు. మునిగిపోతున్నప్పుడుకూడా ఏవో ఆదర్శాలను వల్లె వేసుకు కూర్చుంటే, ఎటొచ్చీ బాధపడేవాళ్ళం మనమే. నా మాట వినండి.'

అదే ధోరణిలో భార్య చెప్పుకుపోయింది.

భార్య చెప్పినా, కొడుకు చెప్పినా, ఎవరు చెప్పినా ఒకటే. వారందరు చెప్పేది అతనికి తెలుసు. గతంలో అనేకసార్లు చెప్పారు. తిరిగి ఈ నాడుకూడా చెపుతున్నారు.

ఈ విషయంలో ఇంట్లో అందరిదీ ఒక మాట. భార్య, కొడుకు బాహాటంగా కుండబద్దలు కొట్టినట్లు చెపితే, మిగిలిన పిల్లలు చెప్పని మాటలలో అదే అభిప్రాయాన్ని సృష్టికరిస్తున్నారని శివరామయ్య నమ్మకం.

వారందరు అతనిని దోషిగా చూస్తున్నారని అతని అపోహ.

అన్నా, అనకపోయినా, వారందరి ఉద్దేశం ఒకటే— తను వెళ్ళి ఆఫీసరుగారితో మాట్లాడాలి. 'మాట్లాడడం' అందమైన మాట. గౌరవప్రదమైన మాట. కాని, దాని అసలు అర్థం వేరు. మాట్లాడడమంటే వెళ్ళి, వారి కాళ్ళమీద పడి ప్రాధేయపడడం. అలాంటి పనులు తన తత్వానికి సరిపడవు. అడ్డదారులు తొక్కనిదే ఉద్యోగాలు దొరకడమనేది కలలోని మాట. అందుచేతనే ఈ రోజు వరకు రామం ఆఫీసుల చుట్టూ తిరిగినా, ఫలితం లేకపోయింది.

ఏమి చెయ్యాలి?

భవిష్యత్తు పెద్ద ప్రశ్నార్థకపు గుర్తుతో కళ్ళ ముందు సవాలు చేస్తూనే ఉంది.

తనపై ఆధారపడిన వీరందరు ఏమవుతారు?

ఎక్కడుంటారు?

ఏమిటి తింటారు?

ఏడడుగులు తనతో కలిసి వేసి, తను చూపిన బాటనే నేటివరకు నిస్సంకోచంగా నడిచి తన వెంట వచ్చిన సుందరం, కాలేజీ చదువు పూర్తిచేసి విశ్వవిద్యాలయం వారి మామూలు పట్టాయే పెట్టుబడిగా ఉద్యోగాన్వేషణ చేసి విసిగిపోయిన రామం, పెళ్ళికి ఎదిగి కూచున్న కూతురు, ఇంకా హైస్కూలులో చదువుతున్న ఇద్దరు మగపిల్లలు, వీరందరికి నెల్లాళ్ళ తరవాత ఏ విధంగాను ఉపయోగపడలేని తను. . . ఏమవాలి?

నినాదం జ్ఞాపకం వచ్చింది. . . 'గరీబి హటావో.'

ఎవ రా పోగొట్టగలిగినవారు?

నినాదాలతో కడుపు నిండే కాలం కాదు. పైగా, తన వంటివారు ప్రభుత్వం దృష్టిలో గరీబుల కింద లెక్కరారు.

ఆలోచనలకు అంతూ, పంతూ అంటూ లేదు.

మంచంమీద దొర్లాడు. పాతికేళ్ల సర్వీసుతో శిథిలావస్థలో ఉన్న మంచంకూడా బాధగా మూలిగింది.

ముప్ఫైఏళ్ల సర్వీసుతో శిథిలావస్థలో ఉన్న తన మనస్సు గట్టిగా బయటికి మూలగలేదు. మంచం తనకన్న నయం. బాధను మూలుగుతూ చెప్పుకోగలదు. తన కా ఆస్కారంకూడా లేదు. స్వంత బాధను మూలుగుతూ ప్రపంచంమీద కేడేసి సానుభూతి నర్థించే బలహీనత తనకు లేదు.

ముప్ఫైఏళ్ల సర్వీసులో ఒకరి ముందు తల వంచలేదు. చెయ్యి జాపలేదు. ఎన్ని సమస్యలు ఉప్పెనవలె ముంచుకొచ్చినా, ఎన్ని బాధలు పడ్డా, ఇంతవరకు ధైర్యంగా ఎదురొడ్డి నిటారుగానే నిలబడగలిగాడు. ఇంకా ముప్ఫై రోజుల సర్వీసు మిగిలింది. ఇప్పుడు తల వంచమని భార్యాపుత్రులు అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థించినట్లు నటిస్తూ శాసిస్తున్నారు.

కంట్రాక్టర్లముందు చేతులను బారగా చాపి రెండు చేతులా ఆర్జిస్తున్న కోటేశ్వరం, ఉద్యోగాని కింతని నిర్ధారణ అయిన రేటులో పుచ్చుకొంటున్న పరమేశ్వరం, దొంగ మెడికల్ బిల్లులతో నెలకు వందలకు వందలు గుంజుకొంటున్న భుజంగం, మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్న వారి సంసారాలు పోల్చి చూసుకోవడం తప్పనిసరి. తను, తన కుటుంబం ఈ విధంగా ఉండడానికి కారణమెవరు?



—వి. వి. రమణమూర్తి

'మీ వ్యక్తిత్వం, ఎవరికీ పనికిరాని మీ నియమాలు' అన్నాడు రామం. నిజమా? అంతేనా?

అతని గతం, భవిష్యత్తు కూడా 'అంతే', 'అంతే' అని గోల పెడుతున్నాయి.

విధి, విరామం లేకుండా వినిపించే దోమల సంగీతం. విధి, విరామం లేకుండా ముసురుకొంటున్న ఆలోచనలు. శరీరం యాంత్రికంగా మంచంమీద దొర్లింది.

మంచం మళ్లీ బాధగా మూలిగింది.

ఇంతకూ తను సాధించిన దేమిటి? ఏమయినా ఉందా?

ఉంది. ఆత్మసంతృప్తి. ముక్కుకు సూటిగా పోయా వన్న ఆత్మసంతృప్తి. అదే మిగిలింది.

నిజంగా మిగిలిందా? ఆ ఆత్మసంతృప్తే ఉంటే, ఈ ఆలోచనలు, మానసిక వ్యథతో నిద్ర పట్టని రాత్రులు— ఇవన్నీ ఎందుకు?

ప్రశ్నల నడుగుతున్న అంతరాత్మ. సమాధానాలు చెప్పడానికి ప్రయత్నిస్తున్న అంతరాత్మ. పోగొట్టుకున్న దానిని, పొందుపరిచిన దానిని బేరీజు వేస్తున్న అంతరాత్మ.

ముప్పై ఏళ్ల సర్వీసు ఏభై ఏడేళ్ల జీవితంతో పోటీపడి వెక్కిరిస్తూంది. తనకు మిగిలినవి—ఆదర్శాలు.

ఎవడికీ అక్కరలేని ఆదర్శాలు.

కుటుంబం చూసి మండిపడుతున్న ఆదర్శాలు.

ఏ నాడో లోకం టూకీగా తిలోదకాలిచ్చిన ఆదర్శాలు, నియమాలు, జీవితపు విలువలు.

అవి మిగిలాయి.

రూపాయలు, పైసల బేరంలో ముడి పెట్టబడిన జీవితంలో అవి శుష్కప్రియాలు, శూన్యహస్తాలు.

ఒక్కడే, తనొక్కడే దేశాన్ని బాగుచేద్దామని, మరమ్మత్తు చేద్దామని ప్రగల్భాలు పలికినట్లుకాదా?

ఒక్కడివల్ల అయ్యే పనేనా ఇది?

ఒక్కడివలన కాల గతి మార్పు చెందకపోవచ్చు. కాని, ఆ ఒక్కడుకూడా లేకపోతే. . .?

కాని, తనొక్కడి మొండిపట్టు వలన ఈ కుటుంబం రోడ్డుమీద నిలబడవలసివస్తే, దాని కెవరు బాధ్యులు?

'నువ్వు.'

'నువ్వు.'
'నువ్వు.'
'నువ్వు.'
'నువ్వు.'

కుటుంబంలోని మిగిలిన అయిదుగురు వ్యక్తులు తననే వేలెత్తి చూపిస్తున్నారు.

వారిని నిరాధారంగా నిలబెట్టడానికి నీ కెవ రిచ్చా రీ హక్కు?

అంతరాత్మ అడుగుతున్న ప్రశ్నలకు జవాబు అతని వద్ద లేదు.

కుక్కిమంచం. దాని పక్కనే నేలమీద పాత చాప. అదీ చింకిది. దానిమీద చేతిని తల దిండుగా చేసుకొని నిద్రపోతున్న భార్యను చూశాడు. జాలి.

తన మీద తనకే జాలి.

భార్యమీద జాలి.

సుందరం ఏమి సుఖపడిందనేది కాదు ప్రశ్న. నెల్లాళ్ల తరవాత సుందరం ఇంకా ఎంత సుఖపడుతుందనేది ప్రశ్న.

ప్రశ్నలు. జవాబులు లేని ప్రశ్నలు. జవాబులను విని భరించలేని ప్రశ్నలు.

పిచ్చి సుందరం! ఏదో పెన్షను వస్తుందనుకుంటూంది. ఆమెకు నిజం తెలియదు. చెప్పగల ధైర్యం తనకు లేదు.

ముప్ఫై ఏళ్ల సర్వీసు.

శాశ్వతంగా అశాశ్వతమైన సర్వీసు.

ముప్ఫై ఏళ్ల టెంపరరీ సర్వీసు!

డిపార్టుమెంటునుండి డిపార్టుమెంటుకు బదిలీ. మూయబడిన డిపార్టుమెంటులు. బదిలీ కాబడ్డ ఉద్యోగులు. మళ్లీ కొత్త సర్వీసు. టెంపరరీ సర్వీసు.

టెంపరరీ సర్వీసులో క్వాజీపెర్మనెంట్.

త్రిశంకుస్వర్గం లాగ అర్ధ శాశ్వతం!

శివరామయ్యకు నవ్వు వచ్చింది. అర్ధ శాశ్వతాన్ని కూడా కనిపెట్టగలిగిన మేధావి తెలివితేటలకు నవ్వుకున్నాడు.

క్వాజీపెర్మనెంట్— అర్ధ శాశ్వతం.

సరియైన మాట. 'ఉద్యోగంలో ఉన్నంతవరకే నీ జీవితం, బ్రదర్. ఆ తరవాత అది శుద్ధ దండుగ' అని చెప్పడానికి బదులుగా అర్ధ శాశ్వత మన్నారు.

తాత్కాలికమైనా, అర్ధ శాశ్వతమైనా తన సర్వీసుకు పెన్షను రాదు. ఆ సంగతి సుందరానికి తెలియదు. తనకు తెలుసు. అందుకే భవిష్యత్తు ప్రశ్నార్థకం.

ఆలోచనలతో సతమతమవుతున్న ఆ మానవుడికి ఎప్పుడో నిద్ర పట్టింది.

## మూడు రోజుల తరవాత


హుషారుగా సిగరెట్టు దమ్ము లాగుతూ అనౌన్సు చేశాడు భుజంగం. 'ఒరేయ్. ఈ సంగతి విన్నారా? మన శివరామయ్య లేడూ? ఎవరు? మన ధర్మపన్నాల శివరామయ్య. పడ్డాడ్రా! కక్కుర్తి పడ్డాడు.'

'నేను నమ్మను. ఇంపాసిబుల్!' అన్నాడు పరమేశ్వరం.

'నమ్ము, నమ్మకపో. నేను చెప్పినది మాత్రం నిజం.'

'ఆశ్చర్యంగా ఉందే. నైన్త్ వండర్. ఇంతకీ ఏ మాత్రం?' కుతూహలంగా అడిగాడు కోటీశ్వరం.

'వెర్రి వెంగళప్పా! నీ ఆలోచనలన్నీ ఎప్పుడూ డబ్బుతో ముడిపడి ఉంటాయి. కక్కుర్తంటే ఒక్క డబ్బుకోసమనే నీ వెధవ లెక్క. కక్కుర్తి అనేక రకాలు. కడుపు కోసం కక్కుర్తి పడిన ఆడది పడుపువృత్తికి

దిగుతుంది. కడుపు కోసం కక్కుర్తి ఎంత పనయినా చేయిస్తుంది. ఆ కక్కుర్తే అతనికికూడా పట్టుకుంది. అందుకే నిన్న మన గ్రేట్ శివరామయ్య తల వంచాడు.'

'దేనికి?'

'కొడుకు ఉద్యోగం కోసం నిన్న ఆఫీసరు కాళ్ళు పట్టుకున్నాడు. మనందరిని పురుగుల్ని చూసినట్టు చూసేవాడు కదా? నిన్నటితో రోగం కుదిరింది. ఎవడయినా అంతేనోయ్, మహానుభావా! తనదాకా వచ్చేవరకే ధర్మపన్నాలు. శివరామయ్య పడ్డాడు. ఓ వాట్ ఎ ఫాల్ ఇటీజ్ మై కంట్రీమెన్! లెటజ్ సెలిబ్రేట్. నాగులూ! మూడు ప్లేట్లు స్వీట్సు పట్రావోయ్ ఈ శుభసమయంలో నీ కొక ప్లేటు శాంక్షను చేశాను,

నిటారుగా నిలబడగలిగిన వ్యక్తిని గౌరవించలేని మనుషులు, అతని పతనానికి సంతోషంతో చప్పట్లు కొట్టగలిగిన మనుషులు ఆనందోత్సాహాలతో శుభ సమయాన్ని సెలిబ్రేట్ చేసుకున్నారు.

## సెప్టెంబరు ఒకటి

నిన్న రాత్రి పది గంటలకు శివరామయ్య ఆత్మహత్య చేసుకున్నాడనే వార్తతో ఆఫీసు గుప్పుమంది.

నిన్నటి రోజు.

అదే అతని సర్వీసులో ఆఖరి రోజు.

అశాశ్వతమైన పోస్టులో, శాశ్వతంగా ముప్పై ఏళ్ళు అర్థశాశ్వత స్థాయిలోని సర్వీసులో ఆఖరి రోజు.

అదే అతని జీవితంలోకూడా ఆఖరి రోజు.

నలుగురు నాలుగు రకాలుగా చెప్పుకున్నారు.

పిరికివాడన్నారు కొందరు.

కొడుకు ఉద్యోగం కోసం ఆఫీసరుగారి కాళ్ళు పట్టుకున్న సిగ్గుతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు మరికొందరు.

ఎవరికి తోచినట్టు వారు సంజాయిషీలు చెప్పుకున్నారు.

సాంప్రదాయకపు శోకసభలో కీర్తిశేషులైన శివరామయ్యగారి గుణగణాల్ని తెగపొగిడి, అతనిని స్వర్గానికి మరికొన్ని లక్షల కిలోమీటర్లకు పైకెత్తి గొంతులు తడి ఆరిపోగా, అలసి సొలసిన కంఠాలు మూడు నిమిషాలు సాంప్రదాయికపు మౌనంతో చేతులు దులుపుకున్నాయి.

## ఆ మరునాడు

'నమస్కారములు. వయస్సులో నా కన్నా చిన్న వారయినా హోదాలో ఎంతో పెద్దవారు. ఈ నా ఆఖరి ఉత్తరాన్ని సహృదయంతో అర్థం చేసుకోమని అర్థిస్తూ వ్రాస్తున్నాను.

జీవితం గురించి నాకు కఠోరమైన నియమాలు, నమ్మకాలు ఉండేవి. వాటినే నమ్ముకొని, వాటి నీడనే బ్రతుకుతూ నా జీవితాన్ని ఇంతవరకు ఈడ్చుకు వచ్చాను.

కాని, కాలం మారింది. మనుష్యులు, వారి జీవితపు విలువలుకూడా పూర్తిగా మారాయి. ముఖ్యంగా ఉద్యోగస్థులు ఎన్నింటితోనో రాజీ పడితేనేగాని బ్రతకలేని స్థితికి వచ్చారు.

మా పెద్దవాడు కాళ్ళరిగేటట్లు ఆఫీసుల చుట్టూ ఉద్యోగం కోసం తిరిగాడు. మీకు తెలుసుగా దేశంలోని పరిస్థితి ఎలాగుందో? వాడికి ఇంతవరకు ఉద్యోగం దొరకకపోవడంలో ఆశ్చర్యం లేదు. మూడేళ్ళబట్టి



"భిక్షాందేహి .."

చిత్రం—పి. రామారావు (కుంభకోణం)

ఇంటర్వ్యూలకు వెళుతూనే ఉన్నాడు. కాని, ఫలితం లేకపోయింది.

చివరకు మన ఆఫీసులో ఇంటర్వ్యూకు పిలిచారు. రికమెండేషన్ల బలాబలాలతో మా వాడికి ఉద్యోగం దొరకడమనేది అసంభవం.

జీవితంలో మొదటిసారిగా నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

వ్యక్తిగా నే నేం చెయ్యాలి?

కొడుకు జీవితం నా కళ్ళముందే పాడయిపోతుంటే తండ్రిగా నే నేం చెయ్యాలి?

నేను నమ్ముకున్న మూలసూత్రాలు చాలా రోజులు జయించాయి. తండ్రిగా నా బాధ్యతను విస్మరించాననే చెప్పుకోవాలి.

ఈ ఉద్యోగంకూడా మా వాడికి దొరకకపోతే?

ఎంతో మానసిక సంక్షోభం తరవాత చివరకు మిమ్మల్ని అభ్యర్థించాను.

అదే నా సర్వీసులో నేను చేసిన మొదటి తప్పు; ఆఖరి తప్పుకూడా. సహృదయంతో క్షమించగలరను కుంటా.

ఈ ఉత్తరం మీ కందేసరికి నా ఆత్మహత్యను గురించి ఎన్నో అభిప్రాయాలు విని ఉంటారు. కనీసం మీ రయినా నిజాన్ని తెలుసుకుంటారనే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

నే నెందుకు ఆత్మహత్య చేసుకోవలసి వచ్చింది?

మూలధనంగా నేను నమ్ముకున్న జీవితపు విలువలను ఆఖరి దశలో, అనివార్యమైన పరిస్థితులలో హత్య చేసుకున్నందుకా?

అవును. అదొక కారణం.

మరి రెండు కారణాలుకూడా ఉన్నాయి. అవి రెండూ ప్రభుత్వ యంత్రాంగంలోని రెండు అసమంజసమైన భాగాలు. వాటి గురించే నేను విశదంగా వ్రాయదలుచుకున్నాను,

మొదటిది— ఈ రోజులలో సామాన్యుడికి ఉద్యోగం దొరకడమనేది కలలోని వార్త. దండిగా లంచాలనయినా పొయ్యాలి. లేదా తిరుగులేని రికమెండేషన్లయినా ఉండాలి. ఈ రెండిటిలో ఏది లేకపోయినా, వాడు దమ్మిడీకి మారడు. ఈ పరిస్థితులలో నే నేం చెయ్యాలి? సర్వీసులో ఉండగానే చనిపోయిన ఉద్యోగి కుటుంబానికి చేయూతగా, ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగ మివ్వవచ్చునని గవర్నమెంటు ఆర్డరుంది. నేను రిటైరయి జీవచ్ఛవం వలె బ్రతికి ఉంటే మాత్రం మా వాడికి ఉద్యోగం దొరకకపోవచ్చు. దొరకదుకూడా. నా సర్వీసులో ఇదే ఆఖరి రోజు. గవర్నమెంటు ఆర్డర్లన్నీ నాకు వర్తించడానికికూడా ఇదే ఆఖరి రోజు. ఇదే ఆఖరి అవకాశం. నేను చనిపోవాలంటే ఇదే ఆఖరి రోజు. రేపటి నా చావుతో నా కుటుంబానికి ఏ లాభమూ ఉండదు. అందుకే అనవసరమైన ఈ జీవితాన్ని ఇంతటితో నిస్సంకోచంగా ఆపు చేస్తున్నాను. ఇప్పుడు మా వాడికి ఉద్యోగమివ్వడంలో ప్రభుత్వాని కేమీ అభ్యంతరం ఉండదనుకుంటాను. రెండవ కారణంకూడా సుమారుగా ఇలాంటిదే. రిటైరయిన తరవాత రేపటి నుండి నే నేమి చెయ్యాలనేది ప్రశ్న కాదు. ముప్పై సంవత్సరాల టెంపరరీ సర్వీసులోనే నా జీవితం గడిచి పోయింది. ఆర్డర్ల ప్రకారం నేను రేపు మరణిస్తే, నా కుటుంబానికి పైసా పెన్షను రాదు. టెంపరరీ సర్వీసు కాబట్టి నేను బ్రతికిఉన్నాకూడా నాకు పెన్షను రాదు. నేను బ్రతికి ఉండి నా కుటుంబానికి ఏ విధంగానూ సాయపడలేను, నా కుటుంబానికి రెండు విధాల సాయపడడానికి నాకు ఈ రోజే అవకాశం ఉంటుంది. నేను సర్వీసులో ఉండగానే చనిపోతే, నా కుటుంబానికి పెన్షను దొరుకుతుంది. నా భార్యకు ఆజన్మాంతం పెన్షనిస్తారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి నాకు ఈ రాత్రి పన్నెండు గంటల వరకే వ్యవధి ఉంది. రాత్రి పన్నెండు గంటలు దాటిందా— నా శేష జీవితానికి అర్థమూ ఉండదు. నేను నా కుటుంబానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహాయపడే అవకాశమూ ఉండదు.

కాబట్టి నేను ఈ రోజునే చనిపోవాలి. ప్రభుత్వం, ప్రభుత్వం వారి ఆర్డర్లు అదే ఉద్ఘోషిస్తున్నాయి.

కారణాలను చెప్పానుగా? రేపటినుండి నిరుపయోగమైన నా జీవితాన్ని అందుకే ఈ రోజునే అంతం చేసుకొంటున్నాను.

ప్రతి వ్యక్తి ఆఖరి కోరికను తీర్చాలని అన్ని మతాలు, అన్ని ధర్మాలు ఒప్పుకుంటాయి. నా చివరి కోరికను తీర్చగలరని ఆశిస్తున్నాను.

సెలవు.

—శివరామయ్య.
31—8—72.
రాత్రి పది గంటలు.'

ఉత్తరాన్ని చదవడం ముగించిన ఆఫీసరు స్థాణువు వలె కుర్చీలో ఉండిపోయాడు.

★